GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 సంచిక : 259 ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ బుధవారం 19-2025 పేజీలు : 3



## 25, 30న తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

**టీ మీడియా,మార్చి 18,తిరుమల :**

మార్చి 25, 30న తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు టిటిడి అధికారులు తెలిపారు. మార్చి 25న శ్రీవారి కోయిల్ అల్వార్ తిరుమంజనం, మార్చి 30 ఉగాదిన శ్రీవారి ఆస్థానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించింది. ఈ సందర్భంగా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే శ్రీవారి ఆలయంలో నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన సేవ సైతం రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ షెడ్యూల్ ప్రకారం వీఐపీ భక్తులు తిరుమల శ్రీవారి దర్శన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచించారు.

# జనభా ప్రాతి పాదికన ఎస్సీ రిజర్వేషన్లు

- సీఎం రేవంత్ రెడ్డి

**టీ మీడియా,మార్చి 18,హైదరాబాద్ బ్యూరో:**



షెడ్యూల్డు కులాల రిజర్వేషన్లను 15 నుంచి 18 శాతానికి పెంచాలన్న ప్రతిపాదనపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. రిజర్వేషన్లను పెంచడానికి సహేతుకమైన విధానం పాటించాల్సి ఉన్నందున 2026 జనాభా లెక్కలు పూర్తయిన తర్వాత ఆ జనాభా నిష్పత్తి మేరకు ఎస్సీ రిజర్వేషన్లను 15 నుంచి 18 శాతానికి పెంచడానికి ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. మంత్రి దామోదర రాజనర్సింహా శాసనసభలో ప్రవేశపెట్టిన 'షెడ్యూల్డు కులాల రేషనలైజేషన్ ఆఫ్ రిజర్వేషన్' బిల్లుపై ముఖ్యమంత్రి మాట్లాడారు. రిజర్వేషన్లను పెంచడంతో పాటు దామాషా ప్రకారం గ్రూపు 1, 2, 3 కేటగిరీల వర్గీకరణ బాధ్యతను కూడా ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు.ప్రస్తుత రిజర్వేషన్లను పెంచాలంటే సహేతుకమైన విధానం పాటించాల్సి ఉంటుంది. 2011 జనాభా లెక్కలు మాత్రమే అధికారికంగా అందుబాటులో ఉన్నాయి. చట్టపరంగా ఎలాంటి చిక్కులు ఎదురుకాకుండా రిజర్వేషన్లు పెంచాలంటే కేంద్ర ప్రభుత్వం కనుక 2026 జనాభా లెక్కలు చేపడితే ఆ జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడానికి వీలవుతుంది" అని వివరించారు. షెడ్యూల్డు కులాలకు మరింత ప్రయోజనం చేకూర్చే విషయంలో ప్రభుత్వం పారదర్శకమైన కార్యాచరణ చేపడుతుందని, ఇలాంటి విషయాల్లో భేషజాలు లేకుండా అందరినీ సంప్రదించి వారి అభిప్రాయాల మేరకు ముందుకు వెళుతామని వివరించారు.షెడ్యూల్డు ఉప కులాల వర్గీకరణ బిల్లు కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియకు శాసనసభ పార్టీలు రాజకీయాలకు అతీతంగా పూర్తి స్థాయిలో మద్దతు పలికినందుకు సభ్యులందరికీ ముఖ్యమంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వర్గీకరణ సమస్యకు శాసనసభ శాశ్వతమైన పరిష్కారం చూపించడం ఒక చారిత్రాత్మకమైన సందర్భంగా అభివర్ణించారు. వర్గీకరణ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. కృష్ణమాదిగ గారితో పాటు చాలా మంది 30, 35 ఏండ్లపాటు జరిగిన వర్గీకరణ పోరాటంలో ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లలో ప్రాధాన్యత ఇవ్వడం, ఆ కుటుంబాల్లో విద్యావంతులుంటే రాజీవ్ యువ వికాసం పథకం కింద చేయూతనందిస్తామని ముఖ్యమంత్రి గారు హామీ ఇచ్చారు.ఎస్సీల్లో రేషనలైజేషన్ ఆఫ్ రిజర్వేషన్ జరగాలని 2004 లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి ఉన్న కాలంలో శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించడం, ఆ తర్వాత జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్ నియామకం, ఆ కమిషన్ నివేదిక, తదుపరి అంశం సుప్రీంకోర్టుకు చేరడం వంటి ఎస్సీ వర్గీకరణ అంశంలో చోటుచేసుకున్న సంఘటనల పరిణామక్రమాన్నిముఖ్యమంత్రి వివరించారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి దామోదరరాజనర్సింహ నేతృత్వంలో ఎస్సీ శాసనసభ్యులందరూ ఒక కమిటీగా ఢిల్లీ వెళ్లి ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తమ వాదనను బలంగా వినిపించడం, సుప్రీంకోర్టు తీర్పు వెలువడటం, ఆ వెంటనే వంద శాతం అమలు చేస్తామంటూ శాసనసభలో ప్రకటన చేసిన పరిణామాలను వివరించారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో దామోదర రాజనర్సింహ , శ్రీధర్ బాబు , పొన్నం ప్రభాకర్ , ధనసరి అనసూయ సీతక్క , లోక్ సభ సభ్యుడు డాక్టర్ మల్లు రవి తో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు, ఆ ఉపసంఘం సూచన మేరకు జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏక సభ్య కమిషన్ నియమాకం, కమిషన్ పనిచేసిన విధానం, నివేదిక వంటి అంశాలన్నీ ముఖ్యమంత్రి గారు సభలో వివరించారు. కమిషన్ 59 ఎస్సీ కులాలను 3 గ్రూపులుగా విభజించడం, సామాజిక, విద్య, ఆర్థిక పరంగా పూర్తిగా వెనుకబడిన వర్గాలను గ్రూప్ 1 కింద 15 ఉపకులాలను పరిగణలోకి తీసుకుని వారికి 1 శాతం రిజర్వేషన్, మధ్యస్థంగా లబ్దిపొందిన కులాలను గ్రూపు 2 కింద 18 ఉపకులాలను పరిగణలోకి తీసుకుని వారికి 9 శాతం రిజర్వేషన్, గణనీయంగా ప్రయోజనం పొందిన కులాలను గ్రూపు 3 కింద పరిగణిస్తూ వారికి 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని సిఫారసు చేసిన అంశాలను తెలియజేశారు. ఈ అంశంపై శాసనసభ చర్చలో పాల్గొన్న సభ్యులకు, పార్టీలకు ముఖ్యమంత్రి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# సమయం ఇవ్వండి

- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ

**టీ మీడియా, మార్చి 18, హైదరాబాద్ :**



పెద్దన్నను కలిసేందుకు ముప్పై మూడోసారి హస్తినకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి.. అఖిలపక్షంతో వస్తున్నాం సమయం ఇవ్వాలని ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం రేవంత్ సోమవారం లేఖ రాశారు.. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు కేంద్ర మద్దతు కోరారు. విద్యా ఉద్యోగ స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో రెండు బిల్లులకు ఆమోద ముద్ర పడింది. పార్లమెంట్ ఆమోదం పొందేలా కలిసి కట్టుగా కృషి చేసేందుకు అఖిలపక్షాలు సంసిద్ధమయ్యాయి.సభలో చెప్పినట్లుగా రేవంత్ సర్కార్ పార్లమెంట్‌లో బీసీ బిల్లుల ఆమోదం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసింది.. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ ప్రతినిధులతో ఢిల్లీ వెళ్లాలని నిర్ణయించింది. ఈ మేరకు సమయం ఇవ్వాల్సిందిగా ప్రధానికి లేఖ రాశారు సీఎం రేవంత్ రెడ్డి.. బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులను శాసనసభ ఆమోదించిన విషయాలను ప్రస్తావించిన సీఎం రేవంత్ రెడ్డి.. సమయం ఇవ్వాలని కోరారు.తెలంగాణలో ఇప్పుడు విద్యా సంస్థలు, ఉద్యోగాల్లో , షెడ్యూల్ కులాలు 15 శాతం, షెడ్యూల్ తెగలు 7శాతం, మైనార్టీలు 4 శాతం, %దీజ%లకు 23 శాతం రిజర్వేషన్లు వున్నాయి. ఐతే తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కులగుణ నివేదిక ప్రకారం బీసీలు 56.36 శాతం . ఆ మేరకు రిజర్వేషన్ల పెంపుఆవశ్యకతను వివరిస్తూ కేంద్ర మద్దతు కోరనుంది అఖిలపక్షం.. అపాయింట్‌మెంట్ కోరుతూ పెద్దన్నకు లేఖ వెళ్లింది. ఇక ప్రధాని కార్యాలయం నుంచి పిలుపే తరువాయి అఖిలపక్షం ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీని కలవనుంది. కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్?కు మరో లేఖ..ఇదిలాఉంటే.. సీఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్?కు మరో లేఖ రాశారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్ పేరును "పొట్టి శ్రీరాములు చర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్" గా మార్చాలని కోరుతూ కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ కు సీఎం లేఖ రాశారు. తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్? రెడ్డి పేరును పెట్టడంతో.. పొట్టి శ్రీరాములు పేరును చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పెట్టాలని సీఎం రేవంత్? రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

## ఉపాధి హామీ చట్టాన్ని నీరుకార్చిన మోడీ ప్రభుత్వం

- కాంగ్రెస్ నేత, రాజ్యసభ ఎంపి సోనియా గాంధీ

**టీ మీడియా, మార్చి 18, న్యూఢిల్లీ :**



జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంజిఎన్ఆర్ఇజిఎ) మోడీ ప్రభుత్వం నీరుకార్చిందని కాంగ్రెస్ నేత, రాజ్యసభ ఎంపి సోనియా గాంధీ మండిపడ్డారు. మంగళవారం రాజ్యసభలో జీరో అవర్‌లో సోనియాగాంధీ ఉపాధి

మిగతా 3లో..

## యువ మేధావి సిద్ధార్థ్ నంద్యాలను అభినందించిన సీఎం చంద్రబాబు

**టీ మీడియా, మార్చి 18, అమరావతి:**



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుడైన ఎ1-సర్టిఫైడ్ ప్రొఫెషనల్, భారత సంతతికి చెందిన అమెరికన్ విద్యార్థి సిద్ధార్థ్ నంద్యాల కలుసుకున్నారు. కేవలం ఏడు సెకన్లలో గుండె జబ్బులను గుర్తించగల కృత్రిమ మేధస్సు ఆధారిత అప్లికేషన్ 'సిర్కాడియావి'ని సిద్ధార్థ్ అభివృద్ధి చేశాడు.ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాకు చెందిన సిద్ధార్థ్ కుటుంబం అమెరికాలో స్థిరపడింది. 14 ఏళ్ల సిద్ధార్థ్ ఒరాకిల్, ఎ ఆర్ ఎం లచేత గుర్తింపు పొందిన %ూ×% నిపుణుడిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలోనే హృదయ సంబంధ వ్యాధులను ముందస్తుగా గుర్తించడంలో విప్లవాత్మకంగా మార్చడానికి ఒక యాప్‌ను సిద్ధార్థ్ రూపొందించాడు. ఈ యాప్, స్మార్ట్‌ఫోన్ ఆధారిత గుండె ధ్వని రికార్డింగ్‌లను ఉపయోగిస్తుంది. 96 శాతానికి పైగా ఖచ్చితత్వ రేటును సాధించింది. దీనిని ఇప్పటికే యునైటెడ్ స్టేట్స్‌లో

మిగతా 3లో..

## తెలంగాణలో 5 రోజులు వానలు

3లో..

## ఆపరియాల్లోనే నీళ్ల కరువు...? మారనున్నాయా..?

# 5 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి

- కొత్త విధానం తీసుకొస్తున్న ప్రభుత్వం

**టి మీడియా, మార్చి 18, హైదరాబాద్ బ్యూరో :**




స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖను ప్రక్షాళన చేసేందుకు సిద్ధమైన తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు వేగంగా సమర్థవంతమైన, పారదర్శకంగా సేవలందించేలా చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఏప్రిల్ మొదటి వారం నుంచి రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకురావాలని నిర్ణయించింది. నిషేధిత జాబితాలోని గజం స్థలం రిజిస్ట్రేషన్ చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. భూముల క్రమబద్ధీకరణ ఎల్ఆర్ఎస్ ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ మేరకు వెల్లడించారు.స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ సేవలను వేగంగా అందించడం సహా పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఒక్కో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు దాదాపు 45 నిమిషాల నుంచి గంటవరకు సమయం పడుతోంది. ఆ సమయాన్ని మరింత తగ్గించేందుకు స్లాట్ విధానం తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఏప్రిల్ మొదటి వారంలో : స్లాట్ బుకింగ్ విధానం అమలుల్లోకి వస్తే 10 నుంచి 15 నిముషాల్లోనే ఒక్కో రిజిస్ట్రేషన్ పూర్తవుతుందని అంచనా. ఆ స్లాట్ బుకింగ్ విధానాన్ని ఏప్రిల్ తొలివారంలో పైలట్ ప్రాజెక్ట్ కింద కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. స్లాట్ బుకింగ్ వల్ల డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు నిరీక్షించే అవకాశం ఉండదన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, చాట్‌బాట్స్ సేవల్న వినియోగించుకోవాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖపై నిర్వహించిన సమీక్షలో మంత్రి పొంగులేటి సూచించారు.ె ంవెన్యూశాఖకు అనుసంధానం : స్లాట్ బుకింగ్ విధానాన్ని దృష్టిలో పెట్టుకొని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరించాలని అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు. నిషేధిత జాబితాలోని ఆస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ సబ్ రిజిస్ట్రార్‌లు రిజిస్ట్రేషన్ చేయకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భూభారతి తరహాలో ప్రత్యేకంగా పోర్టల్‌ను ఏర్పాటు చేసి నిషేధిత ఆస్తుల వివరాలను అందులో పొందుపరచి రెవెన్యూశాఖకు అనుసంధానం చేయాలని సూచించారు.నిషేధిత జాబితా భూముల జోలికి వస్తే కఠిన చర్యలు : నిషేధిత జాబితాలో ఉన్న గజం స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసినా కఠిన చర్యలు తప్పవని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. నిషేధిత జాబితాలోని ఆస్తులలో గజం భూమి రిజిస్ట్రేషన్ చేసినా క్షణాల్లోనే తన కార్యాలయంతో పాటు స్టాంప్స్ ,రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వెంటనే సమాచారం కనిపించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.ఎల్ఆర్ఎస్‌లను పెండింగ్‌లో పెట్టకూడదు : లక్షలాది కుటుంబాలకు మేలుచేసే భూముల క్రమబద్ధీకరణ ఎల్ఆర్ఎస్‌ను మరింత వేగవంతం చేయాలని అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు. జిల్లా రిజిస్ట్రార్‌లు ప్రతిరోజు సమీక్షించాలని ఏమైనా సందేహాలుంటే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకూడదని స్పష్టం చేశారు. ఎల్ఆర్ఎస్ కోసం జనం ఏళ్లుగా ఎదురు చూస్తున్నారని వారి ఆవేదనను అర్థం చేసుకొని నిబంధనలకు అనుగుణంగా ముందుకెళ్లాలని సూచించారు. తప్పుచేసి ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని హితవు పలికారు. జిల్లా రిజిస్ట్రార్లు కేవలం కార్యాలయాలకి పరిమితం కాకుండా ప్రతివారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను సందర్శించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.

## నవభారతదేశంలో ఎల్ఒపికి మాట్లాడే అనుమతి లేదు

- పార్లమెంట్ ఎదుట మీడియాతో రాహుల్ గాంధీ

**టీ మీడియా, మార్చి 18, న్యూఢిల్లీ :**



ప్రజాస్వామ్య దేశంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత (ఎల్ఒపి)ని పార్లమెంటులో మాట్లాడేందుకు అనుమతించాలని కానీ 'నవ భారతదేశం'లో వారికి అనుమతి ఇవ్వబడదని రాహుల్‌గాంధీ విమర్శించారు. పార్లమెంట్ బట్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఉదయం లోక్‌సభలో మహాకుంభమేళాపై ప్రధాని మోడీ ప్రకటన చేశారు. మహాకుంభమేళా ఒక మైలురాయి అని, ఈ ప్రకటనపై ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేయడంతో లోక్‌సభ కొద్ది సేపు వాయిదా పడింది.పార్లమెంట్ ఎదుట మీడియాతో రాహుల్ గాంధీ మాట్లాడారు. జనవరి 29న ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించాలని ప్రధాని మోడీకి సూచించారు. ఈ అంశాన్ని సభలో కూడా మాట్లాడాలనుకుంటున్నానని అన్నారు. ప్రధాని ప్రకటనకు తాను మద్దతు ఇవ్వాలనుకున్నానని, కుంభమేళా మన సంప్రదాయం, చరిత్ర, సంస్కృతి అని అన్నారు. అయితే కుంభమేళా తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రధాని నివాళులర్పించలేదని కూడా ఫిర్యాదు వచ్చిందని అన్నారు. మరో విషయం కుంభమేళాకు వెళ్లిన యువతకు ప్రధాని ఉపాధి చూపాలని, వారికి ఉపాధి అవసరమని అన్నారు. ఉపాధి అంశంపై కూడా ప్రధాని ప్రకటన చేయాల్సి వుందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.మీకు మాట్లాడేందుకు అనుమతి లేదా అన్న మీడియా ప్రశ్నకు సమాధానమిస్తూ.. ప్రజాస్వామ్య నిర్మాణం ప్రకారం ఎల్ఒపిని మాట్లాడేందుకు అనుమతించాలని, కానీ అనుమతి ఇవ్వబడదని, ఇది నవ భారతదేశమని అన్నారు. వయనాడ్ కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ కూడా ఈ అంశంపై స్పందించారు. ఈ అంశంపై ప్రతిపక్షాలకు కూడా అభిప్రాయాలు ఉన్నాయని, వారు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడంలో ఎటువంటి అడ్డంకులు ఉండకూడదని అన్నారు.

# ఆడపిల్ల తల్లిదండ్రులు ఉలిక్కిపడే ఘటన

- వెలుగులోకి కిలాడి లేడీ ఘోరాలు
- ఏడాదిన్నరగా ఆకృత్యాలకు

**టీ మీడియా, మార్చి 18,వరంగల్:**




వరంగల్‌లో కిలాడి లేడీ హైటెక్ సెక్స్ రాకెట్ బాగోతం బట్టబయలైంది. పోలీసుల అప్రమత్తతతో బాలికల అక్రమ రవాణా, సెక్స్ రాకెట్, గంజాయి మత్తు గుట్టు రట్టయింది. ఇన్‌స్టాగ్రాం వేదికగా అమాయక బాలికల జీవితాలతో చెలగాటం ఆడుకున్న ఆ కిలాడీ, ఓ మైనర్ బాలికను ఎరగా వేసి అమాయక బాలికల జీవితాలు బుగ్గిపాలు చేసింది. 9వ తరగతి చదువుతున్న ఓ మైనర్ బాలిక కిడ్నాప్ వ్యవహారంతో అసలు బాగోతం బయటపడింది. మాయలేడీతోపాటు, మైనర్ బాలిక, నలుగురు పోకిరీలను అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 4,300 కండోమ్స్ లభ్యమవడం పోలీసులను సైతం అవాక్కయ్యేలా చేసింది.వరంగల్‌లోని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో మార్చి 11వ తేదీన ఓ మైనర్ బాలిక మిస్సయింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న క్రమంలో పోలీసులు, ఆడపిల్లలున్న ప్రతీ తల్లిదండ్రులు అవాక్కయ్యే ఘోరాలు బయటపడ్డాయి. మైనర్ బాలికలు, ధనవంతులైన మహిళలను టార్గెట్‌గా చేసుకుని ఇన్ స్టాగ్రామ్ వేదికగా చేస్తున్న ఆకృత్యాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికే వాళ్ళ వలలో చిక్కుకుని ఎంతో మంది బలయ్యారు. మైనర్ బాలికలకు గంజాయి, డ్రగ్స్ ఇచ్చి హత్యాచారం చేయిస్తున్నట్లు గుర్తించారు. వారిని వీడియోలు తీసి బ్లాక్ మెయిల్ చేస్తూ వ్యభిచారం చేయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. బాలికలు, ఇన్‌స్టాగ్రామ్ మోజులో ఆరాటపడే మహిళలే వీరి టార్గెట్. వారిని సెలెక్ట్ చేసుకుని మరి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయాలు పెంచుకుని వ్యభిచార రొంపిలోకి లాగుతున్న ఓ కిలాడీ లేడీ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలోనే ఓ మైనర్ బాలికను అడ్డుపెట్టుకుని ఆ మాయలేడీ చేసిన అరాచకాలు పోలీసులకే షాక్ ఇచ్చాయి. మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సంప్రీత్ సింగ్ ఈ మహిళతో పాటు మరో నలుగురుని అరెస్ట్ చేసి మీడియా ముందు హాజరుపర్చారు..వరంగల్ సీపీ తెలిపిన వివారాల ప్రకారం....మార్చి 11వ తేదీన

మిగతా 3లో..



## బిసి రిజర్వేషన్ పోరాటంకు నాయకత్వం

సీఎం రేవంత్ రెడ్డి

3లో..

# 18 ఏళ్లు నిండిన వారికి ఓటరుగా అవకాశం



- **జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**టీ మీడియా, మార్చి 18, వనపర్తి బ్యూరో :**
2025 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఫామ్ 6 ద్వారా దరఖాస్తు చేసుకుంటే, రాబోయే ఎన్నికల్లో ఓటరుగా అవకాశం లభిస్తుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో ఫామ్ 6, 7, 8 లపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఫామ్ 6, 7, 8 లపై అవగాహన కలిగి ఉండాలని, వీటిపై ఏమైనా సందేహాలు ఉంటే నివేదిస్తే, వాటిని ఎన్నికల సంఘానికి సమర్పించడం జరుగుతుందని చెప్పారు. ఏప్రిల్ 1, 2025 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఫామ్ 6 ద్వారా కొత్త ఓటర్ గా నమోదు చేయవచ్చని చెప్పారు. ఎవరైనా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి నివాసం మారినప్పుడు ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకొని మార్పు జరిగిన ప్రాంతంలో ఓటు పొందవచ్చని చెప్పారు. అదేవిధంగా, మరణించిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించేందుకు ఫామ్ 7 ద్వారా అప్లై చేయవచ్చని చెప్పారు. ఫామ్ 7 ఎవరైనా దరఖాస్తు చేయవచ్చని, దాని ఆధారంగా బిఎల్వోలు వెరిఫై చేసి ఓట్లను తొలగించడం జరుగుతుందన్నారు. ఫామ్ 6 ద్వారా కొత్త ఓటర్లు మాత్రమే నమోదు చేసుకోవాలని, ఇదివరకే ఓటు కలిగి ఉండి మళ్లీ ఫాం 6 ద్వారా అప్లై చేసుకోవడం సరికాదని సూచించారు. ఇప్పటికే జిల్లాలో ఎలక్ట్రోరల్ రోల్ ను ప్రచురించడం జరిగిందని, సంబంధిత పార్టీల ప్రతినిధులు తమ పార్టీ నుంచి కాంటెస్ట్ చేయబోయే వారి పేర్లు రోల్ లో ఉన్నాయో లేవో ముందుగానే తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఎవరికైనా ఎలక్ట్రోల్ రోల్ లో పేరు ఉంటేనే ఓటు వేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, సి సెక్షన్ సూపరింటెంట్ కిషన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కాంగ్రెస్ నుంచి రాజేంద్రప్రసాద్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి గట్టు యాదవ్, బిజెపి నుంచి కుమారస్వామి, సిపిఎం నుంచి పరమేశ్వర ఆచారి, టిడిపి నుంచి కొత్తగళ్ల శంకర్, బీఎస్పీ నుంచి రాజు, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారెడ్డి, అజయ్ కల్లం భేటీ

- **ఆలయ అభివృద్ధిపై సమీక్షా**

**టీ మీడియా, మార్చి 18, వనపర్తి బ్యూరో :**
ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రఖ్యాత జోగులాంబ ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ అజయ్ కల్లం సమీక్ష నిర్వహించారు. మంగళవారం ప్రజా భవన్ లో జరిగిన ఈ భేటీలో జోగులాంబ ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన ప్రణాళికపై చిన్నారెడ్డి, అజయ్ కల్లం చర్చించారు.కొన్నేళ్ల క్రితం మహబూబ్ నగర్ కలెక్టర్ గా విధులు నిర్వహించిన సందర్భంగా అజయ్ కల్లం జోగులాంబ ఆలయాన్ని వెలుగులోకి తీసుకుని వచ్చి అభివృద్ధి పనులు చేపట్టారు. జోగులాంబ ఆలయ అభివృద్ధిలో ఉన్న అనుభవాన్ని అజయ్ కల్లం పంచుకున్నారు. జోగులాంబ ఆలయ అభివృద్ధి కోసం దేవాధాయ, ధర్మాధాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్ సహా ఆలయ కమిటీతో ఇప్పటికే రెండు సార్లు సమీక్షా సమావేశాన్ని నిర్భహించినట్లు చిన్నారెడ్డి తెలిపారు. వచ్చే 20 వ తేదీన మరోమారు సమావేశాన్ని నిర్వహించి జోగులాంబ ఆలయ అభివృద్ధి పనులపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు చిన్నారెడ్డి వివరించారు. సత్వరమే చేపట్టాల్సిన పనుల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని చిన్నారెడ్డి పేర్కొన్నారు.తక్షణ పనులలో భాగంగా ఆలయ ప్రాంగణంలో లైటింగ్, పార్కింగ్, ఆలయ చరిత్రతో ప్రచార బోర్డులు పెట్టాలని, అందుకు బస్సు స్టాండ్స్, రైల్వే స్టేషన్స్, ముఖ్య ప్రదేశాలను ఎంపిక చేయాలని కమిటీకి ఆదేశించినట్లు చిన్నారెడ్డి తెలిపారు.ఆలయ అభివృద్ధిలో భాగంగా బోటింగ్, టూరిజం అభివృద్ధి, అతిథి గృహాల నిర్మాణాలు, ఎవెన్యూ ప్లాంటేషన్, ఆర్చిల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నట్లు చిన్నారెడ్డి పేర్కొన్నారు. భేటీలో వ్యవసాయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాఘవ రెడ్డి, రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీడ్స్ గ్రోవర్స్ సంఘం అంతర్జాతీయ అధ్యక్షులు డాక్టర్ కేశవులు, తదితరులు పాల్గొన్నారు.



## సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలలో ముందుంటాం

- **జీడిమెట్ల పోలీసులు**





**టీ మీడియా, మార్చి 18, మేడ్చల్:**
సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని జీడిమెట్ల పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్నటువంటి రోడ్డు కోత గుర్రై తారు రోడ్డుకి ఫుట్ పాత్ కి ఒక ఫీట్ తేడా ఏర్పడటం వల్ల అక్కడ వాహనదారులు ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని గుర్తించినటువంటి జీడిమెట్ల పోలీసులు సోమవారం రాత్రి మూడు టిప్పర్ల మొరం తీసుకొచ్చి ఆ రోడ్డుపైన వేపించి చదును చేయించారు . ఇందులో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నటువంటి జీడిమెట్ల కానిస్టేబుల్ వెంకటేష్ అలాగే చెన్నారావు లను జీడిమెట్ల ఇన్స్పెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. పోలీసు ఉద్యోగంతో పాటు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయడానికి జీడిమెట్ల పోలీసులు ఎప్పుడు ముందుంటామని ఈ సందర్భంగా ప్రజలకు తెలియజేశారు బాలానగర్ డిసిపి కే సురేష్ కుమార్ ఐపిఎస్ జీడిమెట్ల పోలీసుల్ని అభినందించారు.

# కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**టీ మీడియా ,మార్చ్18 ,నర్వ :**
నర్వ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నారాయణ పేట జిల్లా కలెక్టర్ శ్రీమతి సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ మార్చ్ 21 నుంచి జరిగే పబ్లిక్ పరీక్షలకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకుంటూ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు.ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలను రాయాలన్నారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి వంట సిబ్బందితో మాట్లాడుతూ మెనూ ప్రకారం వడ్డించాలన్నారు. పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు.తదుపరి వాటర్ ప్లాంట్ ను పరిశీలించి చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థుల సహకారంతోకిచెన్ గార్డెన్ ను ఇంకా బాగా నిర్వహించు కోవాలన్నారు.చివరగా పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్ ను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట మండల తహసీల్దార్ మల్లారెడ్డి , ఎంపీడీవో శ్రీనివాస్ , పాఠశాల హెచ్ఎం మరియు మండల విద్యాధికారి ఎన్ రామకృష్ణ , ఇతర జిల్లా,మండల స్థాయి అధికారులు ఉన్నారు.




## తండ్రి అత్తమ్మ జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు

**టీ మీడియా,మార్చి 18,గోదావరిఖని:**
పేద ప్రజలకు నిత్యం సేవా చేయడమే మా లక్ష్యం అని ముత్యాల గ్రామ తాజా మాజీ సర్పంచ్ రామగిరి లావణ్య నాగరాజు అన్నారు.మంగళవారం రామగిరి మండలం ముత్యాల గ్రామంలో గోదావరిఖని మంథని ప్రధాన రహదారిపై లావణ్య నాగరాజు తండ్రి కన్నం బొందయ్య,అత్తమ్మ రామగిరి నంబమ్మ జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...రాజకీయాల్లో ఉన్నా లేకున్నా ఎల్లవేళలా ప్రజలకు సేవ చేయడమే మా కర్తవ్యం అని వేసవిని దృష్టిలో పెట్టుకొని బాటసారిలకు దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం ప్రారంభించడం జరిగిందని లావణ్య తెలిపారు.తాము పదవిలో ఉన్న లేకున్నా ప్రజాసేవ చేయడమే తమ మొదటి కర్తవ్యం అని అన్నారు.త్రాగునీరు అందించడం గొప్పదానమని దాహార్తి తీర్చడం మహా పుణ్యమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## కొలను కలిసిన కాంగ్రెస్ సేవలల్ బీ బ్లాక్ అధ్యక్షులు



**టీ మీడియా, మార్చి 18, మేడ్చల్:**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ సేవాదళ్ బి -బ్లాక్ అధ్యక్షులు గా మొహమ్మెద్ అజమ్ ఎన్నికైన సందర్భంగా మంగళవారం రోజు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని మర్యదాపూర్వకంగా కలిశారు అనంతరం హనుమంత్ రెడ్డిని శాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో ఎన్ ఎం సి మైనారిటీ అధ్యక్షులు అంజద్ మరియు ఇమ్రాన్ పాల్గొన్నారు.

## టీపీసీసీ లేబర్ సెల్ కార్యదర్శిగా శరగడం నర్సింగ రావు



**టీ మీడియా, మార్చి 18, మేడ్చల్ :**
పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కీ చైర్మన్ రాంబాగ్ ప్రకాశ్ గౌడ్ కి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డికి టీపీసీసీ లేబర్ సెల్ కార్యదర్శి గా శరగడం నర్సింగ రావు గారిని నియమించిన సందర్భంగా వారికీ ధన్యవాదాలు తెలియజేస్తూ ఈరోజు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యదాపూర్వకంగా కలవగా హన్మంతన్న శాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు

# స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు



**టీ మీడియా, మార్చి 18, చిన్నంబావి:**
చిన్నంబావి మండలంలోని గడ్డ బస్వాపురం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యాశాఖ అధికారులుగా, తమదైన పాత్ర పోషించి చక్కటి ప్రదర్శన అలరించారు. తరగతి గదులలో విద్యార్థులకు బోధించడం జరిగింది. అదేవిధంగా అధికారులుగా పాఠశాల స్థాయి పర్యవేక్షణలో వివిధ రకాల ప్రశ్నలు వేస్తూ అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు తరగతి గదిలో విద్యార్థులుగా కూర్చుని అభ్యసించే తమ తోటి స్నేహితులు,విద్యార్థులు తమ తరగతి గదులలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించి ఒక కొత్త అనుభూతిని పొందారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్ ఈ ఓ గణేష్ కుమార్, పాల్గొనడం జరిగింది. స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమదైన స్థాయిలో అత్యున్నతమైన ప్రతిభ కనపరచి, రాణించిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు వివిధ కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకొని, క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకొని, భవిష్యత్తులో ఉన్నత స్థానంలో నిలవాలని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు ధీటుగా చదువులు ఉన్నాయని చదువుతోపాటు ఆటాపాటలు, అన్ని రంగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మోహిత్ నాయుడు, మండల విద్యాశాఖ అధికారి ప్రణవ్, ప్రధానోపాధ్యాయుడు కార్తీక్, ఉపాధ్యాయులు భవాని, దీక్షిత, జ్ఞానిక, విశాల్, రాజ్ కుమార్, పరశురాముడు, చరణ్ తేజ, పి ఈ టీ పరమేష్,లు పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో బెక్కెం జడ్ పి ఏచ్ ఎస్ ఎచ్ ఎమ్ విజయవార్ధిని, పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేష్, గ్రామ మాజీ సర్పంచ్ మండడి సత్యా రాణి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.



## ఆరోగ్యశ్రీని సాధించిన మందకృష్ణ మాదిగ

- **కొమ్ము చెన్నకేశవులు మాదిగ**

**టీ మీడియా, మార్చి 18, వనపర్తి బ్యూరో :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలో - ఎస్సీ మాదిగ ఉపకులాల ప్రజలకు 11 శాతం రిజర్వేషన్లు కల్పించాలి.లేదంటే మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం - ఏ పోరాటానికైనా సిద్ధం అని కొమ్ము చెన్నకేశవులు మాదిగఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అన్నారు. మండల అధ్యక్షులు మచ్చ తిరుపతి మాదిగ నేతృత్వంలో వనపర్తి జిల్లా కేంద్రంలో 8వ రోజు ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలు జరుగుతున్న సందర్భంగా ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలలో కూర్చున్నారు.దీక్ష శిబిరానికి విచ్చేసి దీక్షను ఎంఎస్ఎఫ్ నాయకుడు అరకాల రమేష్ మాదిగ నిమ్మరసంతో విరమించడం జరిగింది. దీక్షా శిబిరంలో శివయ్య ,సీనియర్ నాయకులు అడ్డాకుల పవన్ కుమార్, గోపాల్పేట్ మండల కన్వీనర్ అడ్డాకుల రాజేందర్ , తాడుపర్తి గ్రామఅధ్యక్షులు వెంకటయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

## .నూతన కరెంటు ట్రాన్స్ఫార్మ్ ఏర్పాటు



**టీ మీడియా,మార్చి 18,గోదావరిఖని :**
రామగుండం కార్పొరేషన్ 48వ డివిజన్ లో నూతనంగా 100 కె.వి కరెంటు ట్రాన్స్ఫార్మ్ ను ప్రారంభించడం జరిగినది. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశానుసారంగా 48వ డివిజన్ ప్రజల కరెంటు కష్టాలను తీర్చిన తాజా మాజీ కార్పొరేటర్ పొన్నం విద్యా లక్ష్మణ్ గౌడ్,ఈ కార్యక్రమంలో కరెంటు ఏడి వెంకటేశ్వర్లు,ఏఈ జమీల్ పాషా,లైన్ ఇన్స్పెక్టర్ ఉప్పు శ్రీనివాస్,లైన్ మెన్ రచకట్ల శ్రీను,కాలీం,కరెంట్ సిబ్బంది కాంట్రాక్టర్ కృష్ణ, కాంగ్రెస్ కార్యకర్తలు నారాయణ, అశోక్,తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎంపీడీవోగా చెన్నమ్మ



**టీ మీడియా ,మార్చి 18, ఆత్మకూరు:**
ఆమరచింత మండల ఎంపీడీవోగా చెన్నమ్మ తన కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు.ఎంపీడీఓ చెన్నమ్మ గతంలో కొత్తకోట లో భాద్యతలు నిర్వహించింది. అమరచింత లో పనిచేసూన్న శ్రీనివాసులు కొత్తకోటకు బదిలీ ఫై వెళ్లారు.

## ఉపాధి హామీ పనులను తనిఖీ చేసినా అధికారులు



**టీ మీడియా, మార్చి 18,చిన్నంబావి:**
చిన్నంబావి మండలం బెక్కెం గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులకు వచ్చే వెజి సీకర్స్ కు సూచనలు జారీ చేయడం జరిగింది. ముఖ్యంగా ఎండలు అధికంగా ఉన్నందువల్లన ఉపాధి హామీ పనులకు ఉదయం సమయంలో త్వరగా వచ్చే విధంగా చూసుకోవాలని అదేవిధంగా 11 గంటల వరకు పనులు ముగించుకుని ఇండ్లకు వెళ్లాలని సూచించడం జరిగింది. ప్రతి ఒక్కరు ఓఆర్ఎస్, ప్యాకెట్ లను వద్ద ఉంచుకోవాలని అవసరమైనప్పుడు నీళ్లలో కలుపుకొని త్రాగాలని ఆరోగ్యం విషయంలో ఏ మాత్రం అశ్రద్ధ వహించకుండ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించడం జరిగింది.అనంతరం గ్రామంలోని నర్సరీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి గుండ్ల రమణ రావు, ఎమ్ పి ఓ రామస్వామి, పంచాయతీ కార్యదర్శి గోపాల్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ గోపాల్,మరియు ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ పాల్గొనడం జరిగినది.

## విధి నిర్వహణతో జర్నలిస్టులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- **జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అల్లే శ్రీనివాసులు**



**టీ మీడియా, మార్చి 18, వనపర్తి బ్యూరో :**
చిట్యాల డి.సి.కన్వెన్షన్ హాల్ నందు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐజేయు) ఆధ్వర్యంలో మెడికేవర్ హాస్పిటల్స్ హైదరాబాద్ వారి సహకారంతో వనపర్తి జిల్లాలోని అందరూ జర్నలిస్టులకు వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి అల్లే శ్రీనివాసులు సంయుక్తంగా ప్రారంభించి అందరికి ఉచిత టీహబు పరీక్షలు, ఈసీజీ, టుడీ ఈకో, మొదలగు పరీక్షలను ఉచితంగా నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్క జర్నలిస్టు ఒత్తిడి సమస్యలతో విధి నిర్వహణ చేస్తున్న ప్రస్తుత సమయంలో ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని అందుకు అవకాశాన్ని వినియోగించుకుని త్వరిత గతిన ఆరోగ్య సమస్యలను గుర్తించి చికిత్స చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని జర్నలిస్టులందరూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలని, తరచుగా బిపి షుగర్ పరీక్షలు, నడక వ్యాయామం ఆహార అలవాట్లలో మార్పు చేసుకుని దైనందిక కార్యక్రమాలు చేసుకోవాలని సూచించడం జరిగింది.

## పప్పు శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం



**టీ మీడియా, మార్చి 18, చిన్నంబావి:**
చిన్నంబావి మండల పరిధిలోని కొప్పునూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ మార్కుఫెడ్ వనపర్తి ద్వారా రైతులుonline లో పంట నమోదు చేసుకున్న రైతుల యొక్క పప్పు శనగ విత్తనాలను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం మద్దతు ప్రకటించిన ధర 5650/- కి కొనుగోలు చేస్తామని త్వరలో మండలంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబిస్తామని ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ బగ్గారి నర్సింహా రెడ్డి తెలియజేశారు.

## సిద్ధలింగ మహాస్వామి స్మారక పురస్కారాలు




**టీ మీడియా, మార్చి 18, వనపర్తి బ్యూరో :**
వనపర్తి పట్టణానికి చెందిన నలుగురు ప్రముఖులు సోమవారం రాత్రి నారాయణపేట జిల్లా నెరడగం క్షేత్రంలో "తృతీయ సిద్ధలింగ మహాస్వామి" స్మారక పురస్కారాన్ని అందుకున్నారు.గత మూడు రోజులుగా నెరడగం శ్రీ పశ్చిమాద్రీ సంస్థాన విరక్త మఠంలో సిద్ధలింగా మహాస్వామి 60వ ఆరాధన,జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా వివిధ రంగాలలో ప్రావీణ్యం సంపాదించిన వారికి పురస్కారాలు ప్రదానం చేశారు.ఆ నేపథ్యంలో వనపర్తి పట్టణానికి చెందిన గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పలుస శంకర్ గౌడ్,సూర చంద్ర శేఖర్ లను విద్యారంగంలో, చిన్నమ్మ థామస్ ను సామాజిక సేవా రంగంలో, ఆకుల శివరాజలింగంను సాహిత్య రంగంలో చేసిన సేవలకు గాను వీరికి ఈ పురస్కారాలు ప్రదానం చేశారు. నెరడగం మఠ%శీ% పీఠాధిపతి పంచమ సిద్ధలింగ మహాస్వామి మాట్లాడుతూ మనిషి తన జీవితాన్ని సార్థకం చేసుకునే ప్రయత్నంలో ప్రతిభను సాధించడం అనేది ఆయా విషయాలలో వారికి గల ఆసక్తేకాక పూర్వజన్మ సుకృతంగా వివరించారు. ఈనాటి కార్యక్రమంలో కర్నాటక రాష్ట్రంలోని వివిధ మఠాల పీఠాధిపతులు జగద్గురు కొట్టూరు బసవలింగ స్వామి,సదాశివ స్వామి, అల్లమ ప్రభు స్వామి, మహంత లింగ శివాచార్య స్వామి, శాంతమల్ల శివా చార్యస్వామి,సువర్ణగిరి సిద్ధలింగ స్వామి,పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి కొండప్ప తదితరులు పాల్గొన్నారు.వీరికి పురస్కారాలు అందడం పట్ల సాహితీ కళా వేదిక ప్రతినిధులు కందూరు నారాయణ రెడ్డి, సందాపురం బిచ్చయ్య, బైరోజు చంద్ర శేఖర్,బండారు శ్రీనివాస్,డా.శ్యాం సుందర్,డా.టూర్పింటి నరేష్ కుమార్, డి.రాములు హర్షం వ్యక్తం చేశారు.

## పక్షవాతంతో బాధపడుతున్న వారికి పరామర్శ



**టీ మీడియా, మార్చి 18, వనపర్తి బ్యూరో :**
వనపర్తి పట్టణం ఎస్సీ వాడ 21వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త ద్యారపోగు బోరింగ్ రాజయ్య కి చాలా కాలంగా పక్షవాతం రావడం వల్ల ఇంటికె పరిమితం కావడం జరిగింది. ద్యారపోగు రాజయ్య కాంగ్రెస్ పార్టీలో చాలా కాలంగా పనిచేయడం జరిగింది. ఎన్ని పార్టీలు ఉన్న ఆయన పార్టీ మారకుండా కాంగ్రెస్ పార్టీ పై అభిమానంతో కాంగ్రెస్ లో కార్యకర్తగా సుదీర్ఘంగా పనిచేయడం జరిగింది. వారికి ఆరోగ్య రీత్యా ఇబ్బంది ఉన్నందున విషయం తెలుసుకున్న 21వ వార్డు నాయకులు టిపిసిసి వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ద్యారపోగు వెంకటేష్, వార్డు మహిళా అధ్యక్షురాలు గంధం చిట్టెమ్మ, గంధం నాగరాజు, రవి శ్రీ, మహేష్, అంజి, ఆశమ్మ అందరూ కలిసి రాజయ్య ఇంటి దగ్గరికి వెళ్లి వారిని పరామర్శించి వారి ఆరోగ్య క్షేమాన్ని అడిగి తెలుసుకోవడం జరిగింది. వారు త్వరగా కోలుకోవాలని వారికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటామని మనోధైర్యం ఇవ్వడం జరిగింది. అదే విధంగా గంధం పెద్ద బాలయ్య షుగర్ వ్యాధితో బాధ పడుతున్నారు. 3 రోజులుగా అరోగ్యం బాగు లేనందున వెంకటేష్ , గంధం చిట్టెమ్మ, గంధం నాగరాజు అందరూ కలిసి గంధం పెద్ద బాలయ్య ఆరోగ్య క్షేమాన్ని అడిగి తెలుసుకోవడం జరిగింది. వారు త్వరగా కోలుకోవాలని వారికి అండగా ఉంటామని మనోధైర్యం ఇవ్వడం జరిగింది.

# ఆ ఏరియాల్లోనే నీళ్ళ కరువు...? మారనున్నాయా..?

- **భయంకరంగారానున్న రోజులు**

**టీ మీడియా, మార్చి 18, హైదరాబాద్ :**
భాగ్యనగరం, ఒకప్పుడు నీటి వనరుల సమృద్ధితో ప్రసిద్ధి చెందిన నగరం. కానీ ఇప్పుడు హైదరాబాద్ మహానగరం నీటి ఎద్దడి సమస్యతో అల్లాడుతోంది. రానున్న రోజుల్లో ఈ సమస్య మరింత తీవ్రమవుతుందని, ఏప్రిల్-మే నెలల్లో నీటి కటకట అనూహ్య స్థాయిలో ఉండవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం, హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఈ సమస్యపై అధ్యయనం చేసింది.



**100% పెరిగిన ట్యాంకర్ల సరఫరా**
గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం నీటి ట్యాంకర్ల సరఫరా 100 శాతం పెరిగింది. ప్రస్తుతం రోజుకు 11 వేల ట్యాంకర్లు సరఫరా అవుతున్నాయి. ఈ వేసవిలో ఇప్పటివరకు 4.5 లక్షల ట్యాంకర్లు పంపిణీ చేశారు. అయితే, ఆశ్చర్యకర విషయం ఏమిటంటే, ఈ ట్యాంకర్లలో 4 లక్షలు కేవలం 22,000 మంది పదేపదే బుక్ చేసుకుంటున్నారు. ఈ వినియోగదారులు హైటెక్ సిటీ నుంచి బంజారాహిల్స్ వరకు విస్తరించిన ఉన్నత ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో నీటి కొరత ఎంత తీవ్రంగా ఉందంటే, చుట్టూ 4-5 కిలోమీటర్ల పరిధిలో ఒక్క చుక్క నీరు కూడా భూమిలో ఇంకే పరిస్థితి లేదు.

**సిమెంట్ టాపింగ్స్ అభివృద్ధి శాపంగా మారిందా?**
అభివృద్ధి పేరుతో నగరంలో వేసిన సిమెంట్ రోడ్లు మరియు టాపింగ్స్ ఇప్పుడు భూగర్భ జలాలకు పెను ముప్పుగా పరిణమించాయంటున్నారు నిపుణులు. వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా ఈ సిమెంట్ పొరలు అడ్డుకుంటున్నాయి. ఫలితంగా, భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోయాయి. ఒకప్పుడు బోర్ల ద్వారా సమృద్ధిగా లభించే నీరు ఇప్పుడు అరుదైన వనరుగా మారింది. %×నెము% వంటి ప్రాంతాల్లో అంతా సిమెంట్‌తో నిండిపోవడంతో, నీటి రీఛార్జ్ అవకాశం పూర్తిగా తగ్గిపోయింది.

**హై-రైజ్ భవనాల నీటి డిమాండ్**
సిమెంట్ టాపింగ్స్ ఒక్కటే కాదు, నీటి సమస్యకు మరో కారణం హై-రైజ్ భవనాలు. 100 గజాల స్థలంలో 5 నుంచి 8 అంతస్తుల భవనాలు నిర్మించి, ఒక్కో భవనంలో 50 మంది నివసిస్తున్నారు. ఈ భవనాల్లో నీటి వినియోగం అమాంతంగా పెరిగింది. కానీ భూగర్భ జలాలను రీఛార్జ్ చేసే వ్యవస్థలు లేకపోవడంతో సమస్య మరింత జటిలమైంది. ఒక వైపు నీటి లభ్యత తగ్గుతుండగా, మరోవైపు డిమాండ్ పెరుగుతుండటం ఈ సంక్షోభానికి ప్రధాన కారణంగా నిలుస్తోంది.

**ఈ వేసవిలో నీటి కటకట తప్పదా?**
ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే, ఏప్రిల్ %-% మే నెలల్లో నీటి కొరత మరింత తీవ్ర స్థాయికి చేరే అవకాశం ఉంది. ఇప్పటికే ట్యాంకర్లపై ఆధారపడే వారి సంఖ్య పెరుగుతుండటం, భూగర్భ జలాలు ఇంకా అడుగంటుతుండటం ప్రమాదంగా మారింది. హైటెక్ సిటీ, బంజారాహిల్స్ వంటి ప్రాంతాల్లో నివాసులు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**పరిష్కారం ఎక్కడ?**
రాష్ట్ర ప్రభుత్వం, హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఈ సమస్యపై కొంత అధ్యయనం చేసినట్లు చెబుతున్నప్పటికీ, ఇంకా ఆచరణ సాధ్యమైన చర్యలు కనిపించడం లేదు. సిమెంట్ రోడ్ల స్థానంలో తారు రోడ్ల వంటి పరిష్కారాలు, వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను అమలు చేయడం, హై-రైజ్ భవనాలకు నీటి రీఛార్జ్ వ్యవస్థలను తప్పనిసరి చేయడం వంటి చర్యలు తీసుకుంటే ఈ సమస్యను కొంతవరకు తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# తెలంగాణలో 5 రోజులు వానలు

- **వాతావరణ శాఖ చల్లని ముచ్చట**

**టి మీడియా, మార్చి 18, హైదరాబాద్ బ్యూరో :**
మార్చి ముగియనే లేదు ఎండలు మాడు పగలగొడుతున్నాయి. తెలంగాణలో ఈ పరిస్థితి రోజు రోజుకూ శృతిమించుతోంది. దీంతో ఉదయం 10 గంటల తర్వాత బయటకు వెళ్లాలంటే జనం ఆలోచించాల్సిన పరిస్థితి వచ్చేసింది. మధ్యాహ్నం వేళ రోడ్లపై జనం పెద్దగా కనిపించట్లేదు. ఇక రాత్రి వేళ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. తీవ్రమైన ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ప్రశాంతంగానిద్రపోలేకపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వాతావరణ శాఖ అధికారులు తియ్యటి ముచ్చట చెప్పారు. ఈ నెలలో 5 రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ ప్రకటించింది. తెలంగాణలో ఈనెల 21వ తేదీ నుంచి వానలు కురుస్తాయని వెల్లడించింది. మార్చి 21 నుంచి 25 వరకు మొత్తం ఐదు రోజుల పాటు వానలు పడతాయని తెలిపింది. రాష్ట్రంలోని పలుచోట్ల ఈ వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. తేలికపాటి, ఓ మోస్తరుగా వానలు కురిసే అవకాశం ఉందని ప్రకటించారు.

**పొగ మంచు కూడా**
నేటి నుంచి రాబోయే మూడు రోజుల్లో వాతావరణం ఎలా ఉండనుందో వాతావరణ శాఖ అంచనా వేసింది. మూడు రోజులపాటు ఉదయం వేళ పొగ మంచు ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ రోజు వాతావరణంలో పెద్దగా మార్పేమీ ఉండదని తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో కూడా మార్పు ఉండబోదని పేర్కొంది. ఆ తర్వాత మాత్రం క్రమంగా ఉష్ణోగ్రతలు కాస్త తగ్గవచ్చని అంచనా వేసింది.

**ఆ మాటతోనే చల్లదనం :**
మండుతున్న ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వర్షాలు కురవబోతున్నాయ్ అంటూ వాతావరణ శాఖ అలారం మోగించడంతో జనాలు చల్లదనాన్ని ఫీలవుతున్నారు. ఆ ఘడియల కోసం ఎదురు చూస్తున్నారు. వర్షాలు కురిస్తే కొన్ని రోజులపాటు ఆ ప్రభావంతో వాతావరణం చల్లగా ఉంటుందని, ఉష్ణోగ్రతలు తగ్గుతాయని భావిస్తున్నారు. దీంతో 21వ తేదీ రాక కోసం వెయిట్ చేస్తున్నారు. ఆ తర్వాత మార్చి 25 తర్వాత మాత్రం ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. కాబట్టి అనవసర ప్రయాణాలు చేయకపోవడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లోనే బయటకు వెళ్తే మంచిదని చెబుతున్నారు. ఒకవేళ మధ్యాహ్నం వేళ తప్పనిసరి బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, వాటర్ బాటిల్ వెంట పెట్టుకోవాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.



## జడ్‌పిహెచ్‌ఎస్‌లో వీడ్కోలు సమావేశం

**టీ మీడియా, మార్చి 18,చిన్నంబావి:**
చిన్నంబావి మండలం లోని కొప్పునూరు గ్రామంలో పదోవ తరగతి 2024-25 సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సమావేశం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్.ఎం కె స్వామి, అధ్యక్షత వహించారు. విద్యార్థులు పాఠశాల విద్య తర్వాత ఉన్నతంగా ఎదగాలని స్కూల్ టీచర్స్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ విద్యావంతుడు లెంకపల్లి వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## ఫొటోపై ముగిసిన సీఐడీ విచారణ...

**మరోసారి పోసానిని కస్టడీకి కోరే అవకాశం**

**టీ మీడియా, మార్చి 18, విజయవాడ:**
పోసాని కృష్ణ మురళి ఒకరోజు సీఐడీ విచారణ ముగిసింది. చంద్రబాబు అధికారం కోసం అమిత్ షా కాళ్లు పట్టుకున్నారంటూ ఒక ఫోటోను తయారు చేసి దాన్ని మీడియా సమావేశంలో పెట్టి.. ఏపీ సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు పోసాని. దీనిపై గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన తెలుగు యువత నేత వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. ఆ కేసులో ప్రస్తుతం పోసాని రిమాండ్ ఖైదీగా ఉన్నారు. దీంతో పోసానిని కస్టడీలోకి తీసుకున్న సీఐడీ అధికారులు%ఔ% ఆ ఫోటోను ఎవరు తయారు చేశారు.. ఫోటో ఎక్కడి నుంచి వచ్చింది.. పోసానినే ఫోటో తయారు చేసి మీడియా సమావేశం పెట్టారా లేక మరెవరైనా ఫోటో తయారు చేసి సమావేశం పెట్టమని ఆదేశించారా అనే కోణంలో కస్టడీలో సీఐడీ అధికారులు పోసానిని ప్రశ్నించనున్నట్లు తెలుస్తోంది. విచారణ తర్వాత జీజీహెచ్‌లో పోసానికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత జిల్లా జైలుకు తరలించారు అయితే పోసానిని మరోసారి కస్టడీ విచారణకు తీసుకోవాలని సీఐడీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక పోసాని బెయిల్ పిటిషన్ బుధవారానికి కోర్టు వాయిదా వేసింది. పోసాని కృష్ణమురళిని కస్టడీకి అనుమతిస్తూ గుంటూరు ఆరో అదనపు జూనియర్ సివిల్ న్యాయస్థానం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లపై గతంలో అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు మార్ఫింగ్ చిత్రాలను విలేకరుల సమావేశంలో పోసాని ప్రదర్శించారు. దీనిపై సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయనను పీటీ వారెంట్‌పై కర్నూలు నుంచి గుంటూరు తీసుకువచ్చారు. గత బుధవారం స్థానిక కోర్టులో పోసానిని హాజరుపరచగా రిమాండ్ విధించడంతో జిల్లా జైలుకు తరలించారు. అయితే పోసానిని కస్టడీకి ఇవ్వాలని ఇటీవల సీఐడీ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అందుకు మంగళవారం న్యాయస్థానం అనుమతి ఇవ్వడంతో అధికారులు విచారించారు. పోసాని కృష్ణ మురళి వైసీపీ హయాంలో ఏపీ ఫిల్మ్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పని చేశారు. అయితే పోసాని కృష్ణమురళి వివిధ సమయాల్లో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు నారా లోకేష్‌తోపాటు జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌పై తీవ్ర అభ్యంతరక వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్‌లలో పోసానిపై పలువురు వ్యక్తులు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో ఆయనపై పోలీసులు కేసులు నమోదు చేశారు.



## ఆడపిల్ల తల్లిదండ్రులు ఉలిక్కిపడే ఘటన

**(మొదటిపేజీ తరువాయి..)**
ఓ బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిల్స్ కాలని పోలీస్ స్టేషన్ లో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం చేసుకుని పాఠశాలకు వెళ్లే బాలికలను కిడ్నాప్ చేసి, డ్రగ్స్ ఇచ్చి.. వారిపై అత్యాచారాలు జరిపినట్టు గుర్తించారు. దీంతో పోలీసులు షాక్ గురై డిప్‌గా విచారణ చేయగా ఆ కిలాడీ లేడితోపాటు మరో మైనర్ బాలిక, మరో నలుగురి పాత్ర కీలకంగా ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు తమదైనశైలిలో విచారణ చేయగా ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. హనుమకొండ జిల్లా దామెర మండలం లాదెళ్ల గ్రామానికి చెందిన ముస్కు లత అనే మహిళ తల్లిదండ్రులు లేని ఓ మైనర్ బాలికను చేరదీసి వ్యభిచారంలోకి దించింది. ఆ మైనర్ తో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఇతర మైనర్ బాలికలు, మహిళలకు గాలం వేసే పనిలో పడింది. వారిలో వలలో చిక్కిన వారిని గంజాయి మత్తుకు బానిసలుగా మార్చి వారి చేత వ్యభిచారం చేయించినట్లు పోలీసులు గుర్తించారు. వారితో ఉన్న న్యూడ్ వీడియోలు సెల్ ఫోన్లలో చిత్రీకరించి వారిని వ్యభిచార రొంపిలోకి దింపినట్లు పోలీసులు నిర్ధారించారు. ఇలా ట్రాప్ చేసిన బాలికలు, మహిళలకు మాయమాటలు చెప్పి ఇంటికి తీసుకెళ్ళుతుంది. వారికి మత్తు పదార్థాలు ఇచ్చి.. అప్పటికే తన గ్యాంగ్ కు టచ్‌లో ఉన్న యువకులతో ఆ అమ్మాయిలను ఎరగా వేస్తూ, వచ్చే డబ్బులను ఎంజాయ్ చేస్తూ నిత్యం సోషల్ మీడియా లో హల్చల్ చేస్తున్నట్లు వరంగ్ సీపీ తెలిపారు.
అయితే కిలాడీ లేడీకి డబ్బు ఇచ్చే మానవ మృగాలు.. బాలికలు మత్తులో ఉండగా వారిపై అత్యాచారాలు చేస్తున్నారు. బాలికలు పూర్తిగా స్పృహలోకి రాగానే సదరు కిలాడీ లేడీ గ్యాంగ్ వారిని ఎక్కడ నుంచి తీసుకొస్తుందో అక్కడే వదిలేసి వెళ్లిపోతున్నారు. అంతేకాదు వారిని వీడియోలు చిత్రీకరించి బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ ముఠా దాదాపు ఏడాదిన్నరగా నుండి ఇలాంటి ఆకృత్యాలకు పాల్పడి చాలామంది జీవితాలను నాశనం చేసినట్లు వరంగల్ పోలీసులు తెలిపారు. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసు విచారణలో అసలు బాగోతం బయటపడింది. కిలాడీ లేడీ గ్యాంగ్ చేస్తోన్న అరాచకాలు బయటపడటంతో ముస్కు లత, ఓ బాలిక తో పాటు అబ్దుల్ అఫ్నాన్, షేక్ శైలాని బాబా, ఎండీ అల్తాఫ్, మీర్జా షహీద్ లను అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపారు వరంగల్ పోలీసులు. వారి నుంచి 2కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అల్డా వారి వద్ద 4300 కండోమ్స్ లభ్యం కావడం పోలీసులను అవాక్కయ్యేలా చేసింది. వీరికి తగిన శిక్ష పడేలా చేస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ సంప్రీత్ సింగ్ తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు సెల్ ఫోన్లు ఇచ్చే ముందు ఆలోచించాలని పోలీసులు సూచించారు.

# బిసి రిజర్వేషన్ పోరాటంకు నాయకత్వం

- **సీఎం రేవంత్ రెడ్డి**

**టీ మీడియా,మార్చి 18, హైద్రాబాద్ బ్యూరో:**
బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు జరిగే పోరాటానికి ముందుండి నాయకత్వం వహిస్తానని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు పునరుద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా, నిబద్ధతతో నిర్వహించిన కుల సర్వేను తప్పుబడితే బీసీలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని విడమరిచి చెప్పారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును శాసనసభ ఆమోదించిన నేపథ్యంలో రాష్ట్రంలోని ఆయా బీసీ సంఘాలు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి గారు ప్రసంగించారు. 2026 లో జరిపే జన గణనలో కులగణన చేర్చాలని శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాం. మనం అందరం కలిసి కొట్లాడితే కుల గణనను ఎందుకు చేర్చరు. కొట్లాడితే తెలంగాణ రాలేదా? కొట్లాడితే దేశానికి స్వతంత్రం రాలేదా? కొట్లాడితే జన గణనలో కుల గణన ఎందుకు చేర్చరు. జన గణనలో ఒకసారి కులగణన చేర్చితే ఆ తర్వాత ప్రతి పదేళ్లకోసారి మరింత స్పష్టత వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కులగణన చరిత్రలో ఒక మైలు రాయిగా నిలుస్తుంది. ఈ ప్రక్రియలో భాగస్వాములం కావడం మాకు గర్వకారణంగా ఉంది. దీన్ని తప్పుబడితే బీసీలకు తీవ్ర నష్టం జరుగుతుంది. బలహీన వర్గాలు తమ హక్కుల సాధన కోసం చేసే పోరాటానికి పూర్తి మద్దతుగా నిలబడుతా. ఈ సర్వే పునాది లాంటిది. పునాదిలోనే అడ్డుపడితే మీకు మీరే అన్యాయంచేసు కున్నవారవుతారు. ముందు అమలు చేసుకుని తర్వాత అవసరాన్ని బట్టి సవరణలు చేసుకోవచ్చు. ఈ కుల గణన అందరికీ భగవద్గీత, బైబిల్, ఖురాన్ లాంటిది. కులం ముసుగులో రాజకీయంగా ఎదగాలని భావించే వారి ఉచ్చులో పడొద్దు" అని హితవు చెప్పారు.

# ఉపాధి హామీ చట్టాన్ని నీరుకార్చిన మోడీ ప్రభుత్వం

**(మొదటిపేజీ తరువాయి..)**
చట్టంపై మాట్లాడారు. మోడీ ప్రభుత్వం ఈ చట్టానికి బడ్జెట్ కేటాయింపులు నిరంతరం తగ్గిస్తోందని దుయ్యబట్టారు. ఎంజిఎన్ఆర్ఇజిఎకి నిధులు తగ్గించడం ద్వారా ఈ స్కీమ్‌ను క్రమపద్ధతిలో అణగదొక్కేందుకు కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. చాలా కాలంగా ఈ పథకానికి కేవలం రూ.86వేల కోట్లు మాత్రమే కేటాయించారని, దాని బడ్జెట్ రూ.4000 కోట్లు తగ్గించారని తెలిపారు. ప్రస్తుత కేటాయింపుల్లో దాదాపు 20 శాతం నిధులు గతంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను క్లియర్ చేయడానికే ఉపయోగించారని అన్నారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలో యుపిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ చట్టం గ్రామీణ భారతదేశానికి రక్షణ కవచంగా నిలిచిందన్నారు. ప్రస్తుతం ఈ చట్టం అనేక సవాళ్లను ఎదుర్కొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతన చెల్లింపులు, వేతన రేట్లలో తరచుగా జరిగే జాప్యాలు ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికి కూడా సరిపోవన్నారు. పథకాన్ని కొనసాగించడానికి బడ్జెట్ కేటాయింపులను పెంచాలని, సకాలంలో కూలీలకు డబ్బులు చెల్లించడంతో పాటు రోజువారీ కనీస వేతనాన్ని రూ.400కు పెంచాలని డిమాండ్ చేశారు. ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థను, నేషనల్ మొబైల్ మానిటరింగ్ వ్యవస్థను రద్దు చేయాలన్నారు. పనిదినాలను సైతం 100 నుంచి 150కి పెంచాలని మోడీ ప్రభుత్వానికి సూచించారు. గ్రామీణ కుటుంబాలకు గౌరవప్రదమైన ఉపాధి, ఆర్థిక భద్రతను అందించడానికి ఈ చర్యలు వెంటనే చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు.

## సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

- **సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్**

**టీ మీడియా ,మార్చి 18, దేవరకద్ర:**
దేవరకద్ర మండల కేంద్రంలో వేసవి లో త్రాగు నీటి సరఫరా,విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దేవరకద్ర లో పర్యటించారు. దేవరకద్ర తహశీల్దార్ కార్యాలయం లో తహశీల్దార్,ఎం.పి.డి. ఓ,ఎం.పి. ఓ,ఎం. ఈ. ఓ, ఏ.పి. ఓ,వ్యవసాయ,ఇరిగేషన్,మిషన్ భగీరథ,విద్యుత్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి మండలం లో త్రాగు నీటి సరఫరా,విద్యుత్ సరఫరా పరిస్థితి పై సమీక్షించారు. గ్రామాల్లో వేసవి ముగిసే వరకు నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓవర్ లోడ్ తో సబ్ స్టేషన్ లలో విద్యుత్ సరఫరా లో సమస్య ఉంటే వెంటనే పునరుద్ధరించాలని అన్నారు. అదే విధంగా మండలం లో పంటల పరిస్థితి పై, వేసవి లో భూగర్భ జలాలు ఇంకి పోయి పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందా అధికారులతో సమీక్షించారు. వ్యవసాయ, ఇరిగేషన్, విద్యుత్ అధికారులు గ్రామాల్లోపర్యటించాలని, రైతులతో మాట్లాడి సలహాలు సూచనలు ఇవ్వాలని అన్నారు. బోరు బావుల కింద భూగర్భ జలాలు ఇంకి పోయి పంటలు ఎండి పోయే పరిస్థితి ఉంటేనీటిని వృదా చేయకుండా పొదుపుగా వాడుకొనేలా రైతులకు అవగాహన కలిగించాలని అన్నారు. వచ్చే సీజన్ లో వరి ప్రత్యామ్నాయం గా ఆరు తడి పంటలు వేసుకునేలా రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కలిగించాలని అన్నారు. డోకూర్ గ్రామం లో వరి క్షేత్రం పరిశీలించినఅనంతరం రైతు చంద్రశేఖర్ రెడ్డి వ్యవసాయ క్షేత్రం లో వరి పైరును పరిశీలించారు. రైతు12 ఎకరాలలో వరి పైరు వేశారు. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి సూచనలు,సలహాలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణయ్య,ఎం.పి.డి. ఓ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి అగర్వాల్, మిషన్ భగీరథ ఏ.ఈ కీర్తి రెడ్డి,ఇరిగేషన్ ఏ. ఈ.లు హరిందర్,కిషన్ ఇతర అధికారులు ఉన్నారు.



## యువ మేధావి సిద్ధార్థ్ నంద్యాలను అభినందించిన సీఎం చంద్రబాబు

**(మొదటిపేజీ తరువాయి..)**
15,000 మందికి పైగా రోగులు, భారతదేశంలో 700 మంది రోగులపై పరీక్షించారు. వీరిలో గుంటూరు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లోని రోగులను సైతం పరీక్షించారు. సిద్ధార్థ్ స్వయంగా స్మార్ట్‌ఫోన్ ఉపయోగించి ఆసుపత్రిలోని రోగులపై పరీక్షలు నిర్వహించారు. సిద్ధార్థ్ సాధించిన పురోగతి గురించి తెలుసుకున్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఆయనను సచివాలయానికి ఆహ్వానించి, ఆయన సాధించిన విజయాన్ని స్వయంగా అభినందించారు. దాదాపు అరగంట పాటు జరిగిన ఈ సమావేశం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధార్థ్ ప్రొఫైల్‌ను సమీక్షించి, కృత్రిమ మేధస్సు, ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలలో ఆయన తన పనిని కొనసాగించాలని ప్రోత్సహించారు. సైన్స్ అండ్ టెక్నాలజీకి గణనీయమైన కృషి చేస్తున్న ప్రపంచ తెలుగు ప్రతిభ కోసం తన దార్శనికతను ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి సిద్ధార్థ్‌కు పూర్తి మద్దతు ఉంటుందని సీఎం హామీ ఇచ్చారు. అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా సిద్ధార్థ్ కు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో యువ ఆవిష్కర్తతో పాటు అతని తండ్రి మహేష్, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సోషల్ మీడియాలో సిద్ధార్థ్ చేసిన పని పట్ల తన ప్రశంసలను పంచుకున్నారు. "ఈ 14 ఏళ్ల బాలుడు గుండె సంబంధిత సమస్యలను గుర్తించడం సులభతరం చేశాడు! డల్లాస్‌కు చెందిన యువ %ూ×% ఔత్సాహికుడు, ఒరాకిల్, రెండింటి నుండి సర్టిఫికేషన్‌లను కలిగి ఉన్న ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుడైన %ూ×%-సర్టిఫైడ్ ప్రొఫెషనల్ సిద్ధార్థ్ నంద్యాలను కలవడం చాలా ఆనందంగా ఉంది. సిద్ధార్థ్ యాప్, సర్కాడియన్ గుండె సంబంధిత సమస్యలను క్షణాల్లో గుర్తించగల వైద్యపరమైన పురోగతి." అని చంద్రబాబు పేర్కొన్నారు. మానవజాతి ప్రయోజనం కోసం సాంకేతికతను ఉపయోగించడంలో సిద్ధార్థ్ అసాధారణ ప్రతిభ, అంకితభావం చాలా ఆకట్టుకుంది. ఇంత చిన్న వయస్సులో, అతను మనందరికీ ఒక ప్రేరణ. ఆరోగ్య సంరక్షణ సాంకేతికత పట్ల అతని మక్కువను కొనసాగించమని హృదయపూర్వకంగా ప్రోత్సహిస్తున్నాను. అతని అన్ని ప్రయత్నాలలో పూర్తి మద్దతుకు హామీ ఇస్తున్నాను." అంటూ సీఎం చంద్రబాబు రాసుకొచ్చారు.

## నాల పై స్పందించిన అధికారులు

**టీ మీడియా మార్చి18, మంథని :**
మంథని అంబేద్కర్ చౌరస్తాలో ప్రధాన రహదారి పక్కన ఎన్నో నెలల నుండి మోరి నాల క్లోజ్ చేయకుండా ఉన్న మోరి ఇబ్బందులు జరిగే అవకాశ లు ఉంటాయి అని టీ మీడియా లో ప్రచురించడం జరిగింది దీనిపై స్పందించి న అధికారులు శాశ్వత పరిష్కారం చేశారు



## మస్యలను వెలికి తీయడంలో జర్నలిస్టులదే కీలక పాత్ర

- **జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**టీ మీడియా, మార్చి 18, వనపర్తి బ్యూరో :**
సమాజంలోని సమస్యలను వెలికి తీయడంలో జర్నలిస్టులదే కీలక పాత్ర అని, అటువంటి జర్నలిస్టులు తమ ఆరోగ్యం పై శ్రద్ధ కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం టీయూడబ్ల్యూజే ( ఐజేయు) ఆధ్వర్యంలో చిట్యాల గ్రామ శివారులోని దేశినేని శ్యామలమ్మ ఫంక్షన్ హాల్లో మెడికోవర్ హాస్పిటల్స్ హైటెక్ సిటీ వారి సహకారంతో జిల్లాలోని జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. టీయూడబ్ల్యూజే (ఐజెయూ) రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి వైద్య పరీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, ఎన్నో సమస్యల్ని వెలుగులోకి తీసుకు వచ్చి పరిష్కారం దిశగా చొరవ చూపుతారని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల దృష్టి సారించాలన్నారు. శారీరకంగా ఫిట్ గా ఉండడం అనేది చాలా ముఖ్యమని, ఎన్ని కోట్లు పెట్టిన కొనలేనిది ఆరోగ్యమేనని కాబట్టి జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. నిత్యం వ్యాయామం చేయడంతో పాటు, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. వ్యాయామం చేయడానికి తీరికలేని పరిస్థితుల్లో కనీసం ఫోన్లో మాట్లాడేటప్పుడు అయినా వాకింగ్ చేయడం ఉత్తమమని సూచించారు. నిత్యం వాకింగ్ చేయడం, వ్యాయామం చేయడం వల్ల అనేక వ్యాధుల్ని దరిచేరనీయకుండా చేయవచ్చని అన్నారు. ఏదైనా వ్యాధిని ముందుగానే గుర్తించడం ఉత్తమం అని, అందులో భాగంగానే జర్నలిస్టులు ఈ మెడికల్ క్యాంపు సద్వినియోగం చేసుకొని తమ జీవనశైలిలో మార్పులు చేసుకోవడం మేలని చెప్పారు. జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎన్నో మంచి కార్యక్రమాలు జరుగుతున్నాయని కలెక్టర్ గుర్తు చేశారు. జిల్లా పౌర సంబంధాల అధికారి పి సీతారాం మాట్లాడుతూ ఆరోగ్యం అనేది ప్రతి ఒక్కరికి ఎంతో ముఖ్యమని, మంచి జీవన శైలిని పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. కేవలం సమస్యలే కాకుండా ప్రభుత్వం చేసే మంచిని కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. టియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ . వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు మాట్లాడరు . అదేవిధంగా డిపిఆర్ఓ సీతారాంను, జిల్లా వైద్యశాఖ అధికారి శ్రీనివాసులును, మెడికవర్ ఆసుపత్రి కార్డియాలజిస్ట్ దయా వాస్వనిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమ నిర్వహణను ముందుండి నడిపించిన జర్నలిస్టులు బొద్దుపల్లి లక్ష్మణ్, మన్యం, తైలం అరుణ్ రాజ్ , గంధం దినేష్, కుమార్ లను కలెక్టర్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ ప్రతినిధులు, జర్నలిస్టులు, వైద్యశాఖ అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## రుణాల అవకతవకలపై డ్వాక్రా మహిళల ఆందోళన

**టీ మీడియా,మార్చి 18,రాజవొమ్మంగి (అల్లూరి సీతారామరాజు జిల్లా) :**
బ్యాంకు రుణాలు అవకతవకలపై స్థానిక వెలుగు కార్యాలయంవద్ద మహిళలు మంగళవారం ఆందోళన చేపట్టారు. మండలంలోని తంటికొండ పంచాయతీ వట్టిగడ్డ గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలకు రాజవొమ్మంగి యూనియన్ బ్యాంకులో 33 డ్వాక్రా సంఘాలు ఉండగా అందులో 15 డ్వాక్రా సంఘాలలో సంఘ సభ్యులు అనుమతులు, ఎటువంటి సమాచారం లేకుండా డ్వాక్రా రుణాలు మంజూరు చేసి బ్యాంకు ఖాతాలో జమ చేసి తిరిగి బ్యాంకు వారే తీసుకున్నారంటూ వట్టిగడ్డ గ్రామానికి చెందిన కావేరి, సంధ్య, వనిత, దివ్య, ప్రియదర్శిని, రమ్య, సాయి తదితర గ్రూపులకు చెందిన సుమారు వందమంది డ్వాక్రా మహిళలు రాజవొమ్మంగి వెలుగు ఆఫీస్ వద్ద ఆందోళన చేపట్టారు. తమకు రుణాలు మంజూరైనట్లు గాని డబ్బులు వేసినట్టుగాని తీసినట్లు గాని ఏటువంటి విషయాలు తెలియదని మాకు తెలియకుండా బ్యాంకులో లావాదేవీలు ఎలా జరిగాయంటూ ఏపిఎం రామాంజనేయులు, ఎంఎంఎస్ సభ్యులను నిలదీశారు. ఈనేపథ్యంలో వెలుగు ఏపీఎం రామాంజనేయులు, ఎంఎంఎస్ లీడర్లు స్పందించి బుధవారం తమ ఒట్టిగడ్డ గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను తెలుసుకుని చర్యలు చేపడతామని డ్వాక్రా మహిళలకు హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో దూసరపాము ఎంపీటీసీ నల్ల సత్యనారాయణ, ఒట్టిగెడ్డ గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.